4
నమస్తే తెలంగాణ
హైదరాబాద్
గురువారం 22 ఆగస్టు 2024
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ల్యాటరల్ ఎంట్రీపై వెనుకడుగు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తలపెట్టిన ల్యాటరల్ ఎంట్రీ భర్తీ విధానం పురిట్లోనే సంధికొట్టింది. విపక్షాలు, స్వపక్షాల వ్యతిరేకత నడుమ మోదీ సర్కార్ వెనక్కి తగ్గక తప్పలేదు. కేంద్రంలోని పలు విభాగాల్లో డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ సెక్రెటరీ పోస్టుల భర్తీకి ఇటీవల యూపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. సాధారణంగా సివిల్ సర్వెంట్లతో భర్తీచేయాల్సిన ఈ పోస్టులను ప్రైవేట్ వ్యక్తులతో భర్తీ చేయడం.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు వీటిలో అమలు చేయకపోవడం వివాదాస్పదమైంది. కొన్ని ప్రత్యేక పదవుల్లో ఐఏఎస్‌లకు బదులుగా ఆయా రంగాల నిపుణులను నియమించాలన్న ఉద్దేశంతోనే ఈ నియామక విధానాన్ని తీసుకువచ్చినట్టు కేంద్రం చెప్తున్నది. 13 పాయింట్ రోస్టర్ పాలసీ ప్రకారం ల్యాటరల్ ఎంట్రీలకు రిజర్వేషన్లు వర్తించవు. ఈ పోస్టుల నియామకంలో రిజర్వేషన్లను తుంగలో తొక్కేందుకు ఒక్కో పోస్టుకు వేర్వేరుగా నోటిఫికేషన్ విడుదల చేశారు. అదే మొత్తం పోస్టులకు కలిపి ఒకే నోటిఫికేషన్ ఇస్తే రిజర్వేషన్లు పాటించాల్సి ఉంటుంది.

ఇప్పటికే కీలక విభాగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల భాగస్వామ్యం తగ్గుతున్నదని ఆందోళన చెందుతున్న విపక్షాలు.. మోదీ సర్కార్ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టాయి. ఎన్డీయే కూటమిలోని లోక్ జనశక్తి (రామ్‌విలాస్) వంటి మిత్రపక్షాలూ ఈ ఎత్తుగడపై అసంతృప్తి వ్యక్తం చేశాయి. ప్రభుత్వ నియామకాల్లో రిజర్వేషన్ల విషయంలో ఎలాంటి రాజీ కుదరని ఆ పార్టీ అధినేత, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ తెగేసి చెప్పారు. అటు ప్రతిపక్షాలు, ఇటు స్వపక్షాల నిరసనతో కేంద్రం నోటిఫికేషన్ వెనక్కి తీసుకోవాలని యూపీఎస్సీని ఆదేశించింది. నిజానికి ఈ ల్యాటరల్ ఎంట్రీ వివాదం ఇప్పటిది కాదు. 2005లో యూపీఏ-1 హయాంలో ల్యాటరల్ ఎంట్రీని రెండో అడ్మినిస్ట్రేటివ్ రీఫామ్స్ కమిషన్ ప్రతిపాదించింది. కానీ, అది పెద్దగా ముం దుకువెళ్లలేదు. 2017లో తన మూడేండ్ల యాక్షన్ ఎజెండాలో భాగంగా నీతి ఆయోగ్ దీన్ని మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. 2018 నుంచి ఇప్పటివరకు ల్యాటరల్ ఎంట్రీ విధానంలో మొత్తం 63 మందిని నియమించారు. వారిలో 35 మంది ప్రైవేట్ వ్యక్తులు. 57 మంది తమ పదవులకు అతుక్కుపోయారు. గత నెల 24న కేంద్రం ఈ వివరాలను లోక్‌సభకు తెలియజేసింది.

రిజర్వేషన్ల వ్యతిరేకిగా ముద్రవేసుకున్న బీజేపీ పాలనలో ల్యాటరల్ నియామకాలను ముందుకు తేవడంపై సహజంగానే గగ్గోలు బయలుదేరింది. దీంతో యూటర్న్‌ల పరంపరలో ఇది కూడా చేరిపోయింది. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ 'చార్ సౌ పార్' అని ఊదరగొట్టగా.. ఆ పార్టీకి కనీసం సాధారణ మెజారిటీ కూడా రాలేదు. 240 దగ్గరే బండి ఆగిపోయింది. దీంతో సంకీర్ణంలోని భాగస్వామ్య పక్షాలను కాదని ముందుకు వెళ్లలేక బీజేపీ ఇబ్బందులు పడుతున్నది. ఒకదాని వెనుక ఒకటిగా పీచేముడ్‌లు తప్పడం లేదు. వక్ఫ్ సవరణ, ప్రసార నియంత్రణ బిల్లుల విషయంలో అదే జరిగింది. ముందు ప్రతిపాదించి ఆపై ప్రతిపక్షాలు, మిత్రపక్షాల నుంచి వ్యతిరేకత రావడంతో ఆయా బిల్లులు జేపీసీకి నివేదించి చేతులు కట్టుకోవాల్సి వస్తున్నది. తన సొంత ఎజెండాపై బీజేపీ నడక ఒకడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్నట్టుగా తయారైంది. ఈ నేపథ్యంలో ఏకాభిప్రాయ సాధన అనేది లేకుండా ముందుకువెళ్తే ఇలాంటి భంగపాట్లు తప్పవని బీజేపీ గుర్తిస్తే మంచిది.

చరిత్రలోకి చొరబాటును క్షమించరెవ్వరు!

ఈ దేశంలో రాష్ర్టాలు, వాటికి సచివాలయాలు ఉండటం సహజమే. కానీ తెలంగాణది, కాలం కొలిమిలో మండి పండిన ప్రత్యేకత్వం. స్వదేశంలో ఐదున్నర దశాబ్దాల సుదీర్ఘకాలం వివక్షా విషాన్ని దిగమింగుతూనే, ఆకాంక్షలు వొరిగిపోకుండా అడుగులేసిన ఆత్మగౌరవ సౌధం తెలంగాణ. నమ్ముకున్న, ఎన్నుకున్న పాలకులే.. కలలు, కన్న పేగులను కాటేస్తుంటే, రెప్ప వాల్చకుండా లక్ష్యం వైపే చూస్తూ గమ్యం చేరిన నిబ్బరత్వం తెలంగాణది. సుదీర్ఘ సంఘర్షణకు వేలాడి, సువిశాల త్యాగాల వనమై పెరిగి, వసంతాన్ని ఇంటికి తెచ్చుకున్న వైవిధ్యమైన రాష్ట్రం మనది.

డాక్టర్ ఆంజనేయ గౌడ్

'ప్రాణమివ్వడమంటేనే పొద్దు పొడవడమాని' అని పాడుకుంటూ నినాదజ్యోతిని ఆరిపోనీకుండా బలిదానాగ్నిని రగిలించిన నేల తెలంగాణ. అన్నీ లాగేసుకోబడిన శూన్య హస్తాల మానవ సమూహం, తమ కన్నీరు, నెత్తురు నాటి, జలాన్నీ, జీవితాన్నీ గెలుచుకున్న భావోద్వేగాల తరగని గని తెలంగాణ. ఈ తెలంగాణ తనం, ప్రత్యేక అస్తిత్వం వెలుగుధారలో నుంచే పాలకుల చూపుండాలి. ఆ దృక్పథంతోనే తొలి ప్రభుత్వ పదేండ్ల ప్రతి పనికీ, తెలంగాణమే కొలమానంగా ఉండింది. దానివల్లే విధ్వంసానికి, విలువల హననానికీ గురైన అన్ని రంగాలను పునర్నిర్మాణం చేయడంతో పాటు, తెలంగాణ పాలన వ్యవస్థకు కేంద్రమైన సచివాలయం కూడా అద్భుతంగా నిర్మించబడ్డది. రాష్ట్రంలో ఇప్పటి కాంగ్రెస్ సర్కారే కాదు, రేపు ఏ ప్రభుత్వమైనా ఆ తెలంగాణ తనాన్నే బలోపేతం చేయాలి. కానీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం తెలంగాణకు విరుద్ధమైన ధోరణిని, ఎందుకో ఏరి కోరి మరీ ప్రదర్శిస్తున్నది. స్వయం పాలనకు కేంద్ర స్థానమైన సచివాలయం ముందు, రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టాలనే ఆలోచన రేవంత్ రెడ్డి సర్కార్‌కు తట్టడమే.. తెలంగాణకు తగులుకున్న పాలనా అరిష్టం కదా?. ఇలా టీఎస్ నుంచి టీజీ, అధికారిక చిహ్నంలో కాకతీయ కళాతోరణం తొలగింపు యత్నం, ప్రస్తుతం రాజీవ్‌గాంధీ విగ్రహం స్థాపన తదితర అంశాలను అనాలోచితంగా, అధికారాహంకారంతో తెలంగాణ తెరమీదకు తెస్తున్నది. భారతీయ భౌగోళిక, రాజకీయ, సామాజిక చరిత్రపై కనీస అవగాహన ఉన్న ఏ నాయకుడైనా, కనీసం కొన్ని ప్రత్యేక అంశాలపై అప్రమత్తంగా వ్యవహరిస్తారు. మరీ ముఖ్యంగా సంస్కృతి, వారసత్వ సంపద, అస్తిత్వం, భాష, ఆత్మగౌరవం వంటి సున్నితోన్నతమైన మౌలిక విషయాల పట్ల జాగ్రత్తగా మసలుకుంటారు. ఈ అంశాల్లో పాలకుడు వేసే అడుగులు, సమాజ పునాదిలో ప్రకంపనలకు దారితీస్తాయి. కానీ, ఇవ్వన్నింటిపై ప్రాథమిక అవగాహన కూడా లేని రేవంత్‌రెడ్డి గుప్పిట్లో.. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం చిక్కడం రాజకీయ వ్యవస్థకే హానికరంగా దాపురించింది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ చేష్టలు, వ్యవహారశైలి, దేశంలో ఇతర రాష్ట్ర పాలకులకూ అంటువ్యాధిలా సోకితే, సంకుచిత తత్త్వం, మానసిక మరుగుజ్జు నైజం ఊబిలో పాలనా వ్యవస్థలు మునిగిపోయే ప్రమాదం ఉన్నది. రేవంత్ రెడ్డిలా గతం లో తమిళనాడు, బీహార్, ఉత్తరప్రదేశ్, కేరళ, పశ్చిమబెంగాల్ తదితర రాష్ర్టాల్లోని కాంగ్రెస్ పార్టీ పాలకులు ప్రవర్తించబట్టే, ఆయా రాష్ర్టాల్లో మళ్లీ మొలకెత్తనే లేని దుస్థితికి ఆ పార్టీ దిగజారిపోయింది.

ఆ అనుభవాల నుంచి కాంగ్రెస్ ఏమీ నేర్చుకోలేదని, రేవంత్‌రెడ్డి లాంటి వారిని ముఖ్యమంత్రులుగా నియమించడం ద్వారా నిరూపించింది. ఒకవేళ కొంతైనా నేర్చుకొని ఉంటే, రేవంత్‌రెడ్డి చర్యలను కట్టడి చేసేవారు కదా? రాష్ట్ర సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడమంటే, తెలంగాణ స్వయంపాలన ఆకాంక్షను వెక్కిరించడమే అవుతుంది. దివంగత మహా నేత రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు, ఆయన ప్రాణత్యాగం కీర్తించదగినదే. అలాగని తెలంగాణ రాష్ట్రం కోసం, ఆత్మగౌరవం కోసం, స్వీయ పాలన ఆశయం కోసం వందలాది మంది యువకులు అమరులైన వీరోచిత మహోన్నత చరిత్రను చిన్నబుచ్చేలా సర్కార్ చర్యలు ఉండటమే ఆందోళన రాజేస్తున్నది. 1982 ఫిబ్రవరిలో బేగంపేట విమానాశ్రయంలో అంజయ్యను అవమానించి, అదే మాసంలోనే రాజీనామా చేయించి, ఆంధ్రకు చెందిన భవనం వెంకట్రామ్‌ను సీఎంను చేశాడు రాజీవ్ గాంధీ. తెలంగాణ రాజకీయ నాయకత్వం పట్ల రాజీవ్‌గాంధీ సైతం వివక్షాపూరితంగానే వ్యవహరించారని చరిత్ర చెప్తున్నది కదా! అందువల్లనే స్వయం పాలన సౌధం ముందు ఏ ఢిల్లీ పెద్దల ప్రతిమ నెలకొల్పినా, అది బలిదానాలకు తలవంపులు తెచ్చే పనే అవుతుంది. ఎవరి ప్రతిమను ఎక్కడ ప్రతిష్ఠించాలో, ఏ స్తూపం ఎక్కడ కొలువుదీరాలో అనే అవగాహన పాలకులకు కొరవడితే ఎలా? కడుపుబ్బరంతోనో, తొందరపాటుతోనో, భజన స్వభావం వల్లనో విగ్రహాలతో చెలగాటం ఏ సర్కార్‌కూ శోభనివ్వదు. దుందుడుకు వైఖరితో విగ్రహాలను వివాదాస్పదం చేస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్ తీరు, తెలంగాణలో మళ్లీ అలజడికి ఆజ్యం పోస్తున్నది. తెలంగాణ ఉద్యమం, అస్తిత్వం, ఆత్మగౌరవంతో సంబంధం లేని వ్యక్తి ముఖ్యమంత్రి అయితే, ఆయన ప్రాధాన్యాలు ఎలా ఉంటాయో స్పష్టంగా రేవంత్‌రెడ్డి అర్థం చేయించేశాడు.

> **తెలంగాణ మౌలిక అస్తిత్వంపై విచ్చలవిడిగా రేవంత్‌రెడ్డి సర్కార్ దాడి చేస్తుంటే, మిగతా రాజకీయ పార్టీలైన వామపక్షాలు, కమలం పార్టీ నేతలు మౌనంగా ఉండటం అందరికీ వెగటు పుట్టిస్తున్నది. ఒకవేళ బీఆర్‌ఎస్ పార్టీ ప్రశ్నించకపోయి ఉంటే సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం పెడతానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించేవాడా?**

అసలు తెలంగాణ సచివాలయాన్ని, దాని ప్రతి చదరపు అడుగులో రాష్ట్ర ఆత్మగౌరవం, వైభవం, స్వయంపాలన వెలుగు ఉట్టిపడేలా తొలి సీఎం కేసీఆర్ నిర్మించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణకు అవసరమైన ఏ చారిత్రక నిర్మాణం చేపట్టినా, ఆనాడు విపక్షంగా ఉన్న కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు అర్థంలేని ఆరోపణలు చేసేవారు. కానీ, అమరుల అద్వితీయ స్తూపం, ఆకాశమంత అంబేద్కర్ విగ్రహం మధ్యలో తెలంగాణ చరిత్రంత అద్భుతంగా నూతన సచివాలయ నిర్మాణం జరిగాక, ప్రతి తెలంగాణ బిడ్డా ఆనందపడ్డాడు. ఇంకా మానవీయంగా పాలనా వ్యవస్థకు నిరంతర ప్రగతిశీల దృష్టికోణం గుర్తుచేసేలా, సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టాడు కేసీఆర్. తెలంగాణ ప్రభుత్వం ఏ ఆశయాల వెలుగులో అడుగులు వేస్తూ, ఏ లక్ష్యసాధన కోసం ప్రయాణం చేస్తున్నదో, అన్ని వ్యవస్థలకూ అర్థం అవ్వడానికి నూతన సచివాలయమే నిలువెత్తు నిదర్శనం. తొమ్మిది నెలల కిందట మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడి ఉంటే, పాలనాలయం వొడిలో తెలంగాణ తల్లి చిరునవ్వులు చిందిస్తూ కొలువుదీరేది. ఇవన్నీ ఎవరు దాయగలరు? విగ్రహ రాద్ధాంతం రాజేయొద్దని హితవు పలికిన విపక్షంపై, పసి పిల్లల ముందు రోత మాటలతో నోరు పారేసుకున్న రేవంత్‌రెడ్డి, తన రాజకీయ కురూపితనాన్ని బయటపెట్టుకున్నాడు. అద్భుతమైన సచివాలయం నిర్మించిన కేసీఆర్‌ను, విగ్రహం కోసం నిగ్రహం కోల్పోయి రేవంత్‌రెడ్డి తూలనాడితే, తెలంగాణ అసహ్యించుకోకుండా ఉంటుందా? ముఖ్యమంత్రే మొరటు మనిషిలా ఇష్టారీతిన దారుణ దూషణలు చేస్తుంటే ప్రజలంతా ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంత ఉక్రోషం, వెగటుతనం ప్రదర్శించిన వికారపు నాయకుడు గతంలో ఎవరూ లేనేలేరు.

> **అసలు విగ్రహ రాద్ధాంతం రాజేసిందెవరు? గత బీఆర్‌ఎస్ సర్కార్ తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించడం కోసం సిద్ధం చేసిన స్థలంలో, మాజీ ప్రధాని ప్రతిమ పెడతానని హడావుడి మొదలు పెట్టిందెవరు? ఇలా రేవంత్‌రెడ్డి సర్కార్ మూర్ఖత్వంతో, తెలంగాణ చరిత్రలోకి చొరబడే ప్రయత్నం చేస్తుంటే, ఆత్మగౌరవంపై అన్యాయమైన దాడికి పాల్పడుతుంటే గులాబీదళం మౌనంగా ఎలా ఉండగలదు? ప్రజల భావోద్వేగాలతో పెనవేసుకున్న ఆ స్థలంలో మాత్రమే రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టొద్దని బీఆర్‌ఎస్ డిమాండ్ చేసింది.**

దీనికే రేవంత్‌రెడ్డి ఉచ్చనీచాలు విస్మరించి, చిన్నారుల సమక్షంలో ఏహ్యమైన భాషతో కారణజన్ముడైన కేసీఆర్‌ను దూషించడం జనాలందరి హృదయాలనూ గాయపరిచింది. రేవంత్‌రెడ్డి నిత్యం తెలంగాణ చరిత్ర చావును కలగంటున్నాడని తేలిపోయింది. ఇంతగా విలువల విధ్వంసానికి పాల్పడుతూ, తెలంగాణ మౌలిక అస్తిత్వంపై విచ్చలవిడిగా రేవంత్‌రెడ్డి సర్కార్ దాడి చేస్తుంటే, మిగతా రాజకీయ పార్టీలైన వామపక్షాలు, కమలం పార్టీ నేతలు మౌనంగా ఉండటం అందరికీ వెగటు పుట్టిస్తున్నది. ఒకవేళ బీఆర్‌ఎస్ పార్టీ ప్రశ్నించకపోయి ఉంటే సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం పెడతానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించేవాడా? ఇప్పటికే తెలంగాణ తల్లి కోసం సిద్ధం చేసిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్నీ, మరోచోట తెలంగాణ తల్లి ప్రతిమను పెట్టడానికి కుట్రలు చేయడం న్యాయమా..? ఢిల్లీ పెద్దల మెప్పు కోసం, తెలంగాణ అమరవీరుల ఆకాంక్షలను కాలరాయడం కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక పాలనకు నిదర్శనం. విగ్రహాలు సైతం విప్లవాలు పుట్టిస్తాయన్న సంగతి కుసంస్కారులకు ఎప్పటికీ అర్థం కాదు. దేనినైనా చూసీచూడనట్లు ఉండవచ్చు, కానీ, చరిత్రలోకి చొరబాటును మాత్రం కలలో కూడా క్షమించలేం.

(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)

అమరుడు.. ఆ కలం వీరుడు

బసవరాజు నరేందర్‌రావు
99085 16549

'మహా ఘనత వహించిన మన నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా, అంతేగాక మనందరికి వ్యతిరేకంగా, మనవారే కొందరు భారత ప్రభుత్వ ఏజెంట్లుగా మారి, మన సమైక్యతను ధ్వంసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. జర్నలిస్టుల రూపంలో మనకు వ్యతిరేకంగా రచనలు చేస్తున్నారు. అలాంటి రాతలు రాస్తున్న ఆ చేతులు ఉండటానికి వీల్లేదు. అవి నరకబడాల్సిందే. అటువంటి ద్రోహులు బతకడానికి వీల్లేదు చావాల్సిందే..' తన చుట్టూ చేరిన వందలాది మందిని రెచ్చగొడుతూ ఆవేశంగా ప్రసంగిస్తున్నాడొక బక్కపలుచని వ్యక్తి. తనలోని అణువణువునా మత దురహంకారాన్ని నింపుకొని, తన ప్రతి అడుగులో విషం వెదజల్లుతున్న వ్యక్తి మరెవ్వరో కాదు, ఆనాటి 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్‌ను తన చేతిలో కీలుబొమ్మగా మార్చుకొని సంస్థానమంతటా దారుణాలు కొనసాగిస్తున్న రజాకార్ల నాయకుడు ఖాసీం రజ్వీ. తన చుట్టూ చేరిన అనుచరులను రెచ్చగొడుతూ ఆయన చేసిన విషపూరిత ప్రసంగం 1948, ఆగస్టు 19న హైదరాబాద్‌లోని ఆనాటి జమ్రుద్ మహల్ సినిమా హాల్‌లో కొనసాగింది.

ఆయన తన ప్రసంగంలో వెళ్లగక్కిన అక్కసంతా, తన అక్షరాలను ఆయుధాలుగా మార్చుకొని ప్రభుత్వ దురాగతాలను ఎండగడుతూ రజాకార్ల దారుణాలను బయటపెడుతూ రచనలు చేస్తున్న ఆనాటి ప్రముఖ పాత్రికేయుడు, మానవతావాది షోయబుల్లా ఖాన్ గురించే. ఖాసీం రజ్వీ ప్రసంగంతో రెచ్చిపోయిన ఆయన అనుచరులు, రజాకార్లు అక్షరాలా ఆయన ఆదేశాలను అమలు పరిచారు. ఫలితంగా ఒక గొప్ప పాత్రికేయుడైన షోయబుల్లా ఖాన్ మీద కాల్పులు జరిగాయి. ఆ కాల్పుల్లో గాయపడిన షోయబుల్లా ఖాన్ 1948, ఆగస్టు 22 రోజున తుది శ్వాస విడిచారు. నవ సమాజ నిర్మాణం కోసం తన ప్రాణాలనర్పించిన అమరజీవి షోయబుల్లా ఖాన్ 1920, అక్టోబర్ 17న లాయహున్నిసా బేగం- హబీబుల్లాఖాన్ దంపతులకు ఖమ్మం జిల్లాలోని సుబ్రవేడులో జన్మించారు. ఆయన తండ్రి హబీబుల్లాఖాన్ మహాత్మాగాంధీకి వీరాభిమాని.

బాల్యం నుంచే సమాజం పట్ల అవగాహనను, అనుబంధాన్ని పెంచుకున్న షోయబుల్లా ఖాన్ సమాజంతో సాన్నిహిత్యం కోసం జర్నలిజాన్ని తన వృత్తిగా ఎంచుకొని ఓయూ నుంచి జర్నలిజంలో బీఏ డిగ్రీ తీసుకున్నారు. నిజాం నిరంకుశ పాలనలో రజాకార్ల దౌర్జన్యాలతో హైదరాబాద్ రాష్ట్రమంతా గజగజా వణికిపోతున్న రోజులవి. ఎటుచూసినా హత్యలు, దోపిడీలు, మానభంగాలు.

నేడు జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్ వర్ధంతి

వీటి మీద పోరాటం చేయాలనుకున్నారు షోయబుల్లాఖాన్. అంతే, అభిమన్యుడిలా సమరక్షేత్రంలోకి కాలు మోపారు. మొట్టమొదట తేజ్ అనే పత్రికలో చేరారు. ఆయన రాతలు నిజాం ప్రభుత్వానికి ఆగ్రహావేశాలను తెప్పించాయి. ఫలితంగా తేజ్ పత్రిక మూతపడింది. తర్వాత రయ్యత్ పత్రికలో సహాయ సంపాదకుడిగా చేరారు. ఇక్కడ కూడా ఆయన కలం నిప్పులని గక్కింది. ప్రభుత్వ ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. ఫలితంగా రయ్యత్ కూడా మూతపడింది.

ఇక లాభం లేదని భావించిన షోయబుల్లా ఖానే తన భార్య, తల్లి నగలను అమ్మి 'ఇమ్రోజ్' అనే పత్రికను 1947 నవంబర్‌లో ప్రారంభించారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా హైదరాబాద్ స్టేట్, ఇండియన్ యూనియన్‌లో కలవాలని తన పత్రికలో రాసేవారు. ఈ రాతలు ప్రభుత్వానికి, ఖాసీం రజ్వీకి ఆగ్రహం తెప్పించేవి. నయానో భయానో ఆయన రాతలకు అడ్డుకట్టవేయాలని ప్రభుత్వం ప్రయత్నించింది. అయితే, మేరునగధీరుడు షోయబుల్లా ఖాన్ వాటిని లెక్క చేయలేదు. చివరికి మత దురహంకారి, నరరూప రాక్షసుడు ఖాసీం రజ్వీ షోయబుల్లా ఖాన్‌ను అంతం చేసే బాధ్యతను తీసుకున్నాడు. జమ్రుద్ మహల్ రజాకార్ల సభలో ఒక గొప్ప జర్నలిస్టుని చంపాలని, ఆయన చేతులను నరకాలని ఆదేశించాడు.

> **ఆ రోజు ఆగస్టు 21 రాత్రి. పని ముగించుకొని తన ఇంటికి బయల్దేరిన షోయబుల్లా ఖాన్ మీద కాల్పులు జరిగాయి. కాల్పులతో షోయబుల్లా ఖాన్ కింద పడగానే ఆయన చేతిని నరికారు. స్థానికులు షోయబుల్లా ఖాన్‌ను దవాఖానకు తరలించారు. మృత్యువుతో రెండు గంటలు పోరాడిన షోయబుల్లాఖాన్ 1848, ఆగస్టు 22న మరణించారు. నిజాం ప్రభుత్వం ఆయన అంతిమయాత్రను నిషేధించింది.**

గోషామహల్ మాలకుంట శ్మశానవాటికలో ఆయన ఖననం జరిగింది. కొద్దిమంది బంధుమిత్రులు చూడటానికి మాత్రమే ప్రభుత్వం అనుమతించింది. ఆ తర్వాత ఆయన కుటుంబం గురించి ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇక, స్వాతంత్య్ర సమరయోధులకు ఇచ్చే పింఛన్ ఆయన కుటుంబానికి అందడానికి నాలుగు దశాబ్దాలు పట్టింది. ఇదీ మన అమరవీరులకు మనమిచ్చే గౌరవం.

మన దేశంలోని అనేక ప్రాంతాలను ఇటీవల భారీ వర్షాలు, వరదలు ముంచెత్తాయి. ప్రకృతి విపత్తుల కారణంగా వందలాది మంది ప్రాణాలు కోల్పోగా.. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. మన దేశంతో పాటు దక్షిణాసియా ప్రాంతంలో వరదలు సాధారణమే. కానీ, వాతావరణ మార్పుల కారణంగా రుతుపవనాల వర్షపాతంలోనూ మార్పులొస్తుండటం తీవ్ర పరిణామాలకు దారితీస్తున్నది.

విలయానికి కారణం గగన నదులే!

డాక్టర్ శ్రీధరాల రాము
94411 84667

అతి తక్కువ వ్యవధిలోనే భారీ వర్షాలు కురుస్తున్నాయి. అంతే కాదు, సుదీర్ఘకాలం పాటు వర్షాలు కురవకపోవడం వంటి అసాధారణ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అతి తక్కువ వ్యవధిలోనే భారీ వర్షాలు కురవడాన్నే మేఘ విస్ఫోటనం (క్లౌడ్ బరస్ట్) అని అంటారు. ఈ మేఘ విస్ఫోటనానికి కారణం గగన నదులు (అట్మాస్ఫియరిక్ రివర్స్) ఏర్పడటమే. వీటినే 'ఫ్లయింగ్ రివర్స్' అని పిలుస్తారు. ఇటీవల కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగి అపార ప్రాణ, ఆస్తి నష్టం సంభవించడానికి ఈ గగన నదులే పరోక్ష కారణం.

సాధారణంగా ఎండ వేడిమి వల్ల మహాసముద్రాల్లోని నీరు ఆవిరిగా మారి, ఆపై చల్లబడి మేఘాలను ఏర్పరుస్తుంది. మేఘాల్లోని నీటి బిందువులు భూమిని చేరే ప్రక్రియలో భాగంగా సాధారణంగా వర్షం కురుస్తుంది. కానీ, గ్లోబల్ వార్మింగ్ కారణంగా మహా సముద్రాల్లోని జలాలు వేడెక్కి భారీమొత్తంలో నీరు, ఆవిరిగా మారి ఆకాశంలో కంటికి కనిపించని నీటి ఆవిరిపాయలుగా ఏర్పడతాయి. వాతావరణంలోని దిగువ భాగంలో ఈ నీటి ఆవిరి భారీ పట్టీగా ఏర్పడి, వేడి ప్రాంతం నుంచి చల్లని వాతావరణం వైపు కదులుతూ ఒక్కసారిగా వర్షంగా లేదా మంచుగా కురుస్తుంది. అది భారీ వరదలకు, కొండచరియలు విరిగిపడి విధ్వంసానికి కారణమవుతుంది. ఈ గగన నదులు కొన్ని వేల మైళ్ల దూరం ప్రయాణించి భారీ వర్షాలను కురిపిస్తాయి.

ఒక గగన నది పరిమాణం సగటున 2,000 కిలోమీటర్ల పొడవు, 500 కిలోమీటర్ల వెడల్పు, 3 కిలోమీటర్ల లోతు ఉంటుంది. అయితే, వీటి పరిమాణం ఇప్పుడు మరింత భారీగా మారుతున్నది. కొన్ని 5,000 కిలోమీటర్ల కంటే ఎక్కువ పొడవు ఉంటున్నాయి. కంటికి కనిపించని వీటిని ఇన్‌ఫ్రారెడ్, మైక్రోవేవ్ ఫ్రీక్వెన్సీలతో చూడవచ్చు. వీటిని వీక్షించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక ఉపగ్రహ చిత్రాలు ఉపయోగపడతాయి.

> **భూమి వేగంగా వేడెక్కుతుండటంతో ఈ గగన నదులు భారీ పరిమాణంలో తీవ్ర రూపాన్ని సంతరించుకుంటున్నాయని, కోట్లాది మంది జీవనాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. హిందూ మహాసముద్రం వేడెక్కడం వల్ల మన దేశంలోనూ గగన నదులు ఏర్పడి జూన్ - సెప్టెంబర్ మధ్య వచ్చే రుతుపవనాల ప్రభావాన్ని మరింత పెంచుతున్నాయని వాతావరణ నిపుణులు అంటున్నారు.**

2023లో నేచర్ జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం.. 1951- 2020 మధ్యకాలంలో మన దేశంలో వర్షాకాలంలో మొత్తం 574 గగన నదులు ఏర్పడ్డాయి. గత రెండు దశాబ్దాల్లో ఏర్పడిన అత్యంత భారీ గగన నదులు మన దేశంలో సంభవించిన 80 శాతం వరదలకు కారణమయ్యాయని ఈ అధ్యయనం పేర్కొన్నది. ఇటీవలి దశాబ్దాల్లో హిందూ మహాసముద్రం జలాలు ఆవిరిగా మారడం గణనీయంగా పెరిగిందని, వాతావరణం వేడెక్కడం వల్ల గగన నదులు ఏర్పడి, వరదలు పెరిగాయని అధ్యయనం తెలిపింది. రుతుపవనాల సమయంలో భారత ఉపఖండం వైపు పయనించే తేమలో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటరాలజీకి చెందిన వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ రాక్సీ మాథ్యూ కోల్ చెప్పారు. తత్ఫలితంగా వెచ్చని సముద్రాల్లోని నీటి ఆవిరి గంటలు, రోజుల వ్యవధిలోనే గగన నదులుగా మారి అతితక్కువ సమయంలో కుండపోత వర్షం కురుస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఇది దేశవ్యాప్తంగా ఆకస్మిక వరదలకు, కొండచరియలు విరిగిపడటానికి కారణమవుతున్నదని అన్నారు.

అమెరికన్ జియోఫిజికల్ యూనియన్ ప్రచురించిన అధ్యయనం ప్రకారం.. తూర్పు చైనా, కొరియా, పశ్చిమ జపాన్‌లో రుతుపవనాల ప్రారంభ కాలంలో (మార్చి - ఏప్రిల్) 80 శాతం వరకు భారీ వర్షపాతానికి గగన నదులతో సంబంధం ఉందని గుర్తించారు. తుపానుల మాదిరిగానే గగన నదులలో వాటి పరిమాణం, తీవ్రత, వాటి వల్ల సంభవించే వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదకర పరిస్థితుల ఆధారంగా వాటిని ఐదు రకాలుగా వర్గీకరించారు. వీటిలో అన్నీ ప్రమాదకరమైనవి కావు, ప్రత్యేకించి తీవ్రత తక్కువగా ఉన్నవి. ఈ గగన నదులు సుదీర్ఘకాలంగా కరువు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో వర్షాలను కురిపిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రకృతి విపత్తులకు మూలకారణం వాతావరణ మార్పులే. పెట్రోల్, డీజిల్, బొగ్గు వంటి శిలాజ ఇంధనాలను మండించడం వల్ల గ్లోబల్ వార్మింగ్ పెరుగుతున్నది. తద్వారా వాతావరణ మార్పులు సంభవించి తీవ్ర నష్టం జరుగుతున్నది. కాబట్టి పర్యావరణ అనుకూల ఇంధనాలను వాడాల్సిన అవసరం ఉన్నది. అంతేకాదు, దాంతో పాటు మొక్కలను విరివిగా నాటాలి. తద్వారా గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించవచ్చు. వరదలు, కొండచరియలు విరిగిపడటం లాంటి ప్రకృతి వైపరీత్యాలను నివారించవచ్చు.

(వ్యాసకర్త: కెమిస్ట్రీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ ఫ్యాకల్టీ)

జవాన్లు బోర్డర్ వీడితే?

కోల్‌కతా ఘటనకు సంబంధించి నిరసనలు చేస్తున్న వైద్యులకు నేనొక ప్రశ్న వేస్తున్నా. 2019లో జరిగిన పుల్వామా దాడికి సంబంధించి బాధితులకు ఇప్పటివరకు న్యాయం జరగలేదు. అందుకని ఒకవేళ జవాన్లు సరిహద్దులను వీడి 'వియ్ వాంట్ జస్టిస్' అంటూ నిరసనలకు దిగితే దాన్ని మీరెలా (వైద్యులు) చూస్తారు? అందుకే మిమ్మల్ని ఒక్కటే కోరుతున్నా. దయచేసి నిరసనలను విరమించండి.

- కునాల్ ఘోష్, టీఎంసీ సీనియర్ నేత